క్లుప్తంగా

వృద్ధులకు తువ్వాళ్లు, పండ్లు పంపిణీ



వృద్ధులకు తువ్వాళ్లు, పండ్లు పంపిణీ చేస్తున్న దాతలు

రాజాం: పట్టణానికి చెందిన అమృత సురేష్, రమేష్‌లు బుధవారం పేద వృద్ధులకు తువ్వాళ్లు, పండ్లు, ఆహార పొట్లాలు అందజేశారు. రేగిడి మండలం వావిలవలస గ్రామంలో సిద్దార్థ అన్నసత్రానికి చెందిన 20 మందికి వీటిని అందించారు. పెద్దపాటి సూర్యారావు జ్ఞాపకార్థం వీటిని అందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో పెద్దపాటి పుణ్యవతి, పాలూరి సిద్దార్థ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయం మేలు



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న అప్పలనాయుడు

తెర్లాం: ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ఏపీసీఎన్‌ఎఫ్ సబ్ డివిజనల్ యాంకర్ కె. అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కుసుమూరులో ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగపడే ద్రావణాలైన పుల్లటి మజ్జిగ, జీవామృతం తయారీపై బుధవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినుము, పెసర పంటలతో పాటు మామిడి, జీడిమామిడి తోటల్లో పూత, పిందె రాలకుండా ఉండేందుకు పుల్లటి మజ్జిగ, జీవామృతం ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కుసుమూరు ఆర్‌బీకే వీఏఏ వెంకశ్వరరావు, రైతులు, వలంటీర్లు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలి



సూచనలిస్తున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

బొబ్బిలి రూరల్: వెలుగు సిబ్బంది ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం వెలుగు ఏపీఎంలు, సీసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ నెల పదో తేదీలోగా లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. సమావేశంలో స్త్రీనిధి ఏజీఎం ఎ.ఉమామహేశ్వరరావు, వెలుగు ఏసీ జె.లక్ష్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి క్రీడాపోటీలకు బాడంగి విద్యార్థులు




జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల పీడీ బి. మోహనరావు తెలిపారు. విజయనగరం జిల్లా యువకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన బ్లాక్‌స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాల విద్యార్థులు కబడ్డీ, వాలీబాల్, వంద మీటర్ల పరుగు పందెం, వాలీబాల్ పోటీల్లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. ఈ మేరకు విద్యార్థులను హెచ్‌ఎం త్రినాథరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా గో పూజ

మెంటాడ: మండల కేంద్రంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా బుధవారం గోపూజ వైభవంగా నిర్వహించారు. ప్రధానార్చకుడు పీసపాటి శ్రీనివాసశర్మ ఆలయ ఆవరణలో ఉన్న గోవులకు పసుపు, పూలతో పూజలు చేసిన అనంతరం భక్తులంతా ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ముప్పిడి నగేష్, మాచర్ల అప్పారావు, కొల్లా భరత్‌కుమార్, నంబూరి సతీష్ పాల్గొన్నారు.

షాపులకు టెండర్లు పిలవాలి



షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న చైర్మన్, తదితరులు

బొబ్బిలి: మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఖాళీగా ఉన్న షాపులకు కొత్తగా టెండర్లు పిలిచి అద్దెలకు ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సిబ్బందితో కలసి షాపింగ్ కాంప్లెక్స్‌ను బుధవారం సందర్శించారు. పది షాపులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట మేనేజర్ బీఎండీ శివప్రసాద్, ఆర్‌ఐ పి. సురేష్ బాబు, తదితరులున్నారు.

అర్హులందరికీ పెన్షన్లు



తెర్లాం: పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



బొబ్బిలి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

తెర్లాం: పార్టీలకతీతంగా అర్హులందరికీ పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డీవీ అప్పారావు ఆధ్వర్యంలో కొత్త లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హతలున్నా జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్స్ లేకపోతే పింఛన్లు మంజూరయ్యేవి కావన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో 39 లక్షల మంది పెన్షన్‌దారులుండగా..ప్రస్తుతం 63 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రతి ఏటా పెన్షన్ పెంచుతూ ఈ నెల నుంచి 2750 రూపాయలు పింఛన్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గర్భాపు లూర్థు, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నర్సుపల్లి బాబ్జీరావు, పార్టీ సీనియర్ నాయకులు జి.రామారావు, ఎం.జగన్నాథం, టి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి మున్సిపల్ ఆడిటోరియంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు కొత్త లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పెన్షన్‌ను మూడు వేల రూపాయలకు పెంచుతారని ఎమ్మెల్యే చెప్పారు.

భైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ రాజారావును వినతిపత్రం అందిస్తున్న హిందూ ధార్మికసంస్థల ప్రతినిధులు

బొబ్బిలి రూరల్: హిందూ దేవుళ్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ ఎస్.రాజారావును బుధవారం కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా హిందూ భక్తమండలి అధ్యక్షుడు మామిడి అప్పారావు మాట్లాడుతూ, హిందువులు శాంతి కాముకులని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ డివిజన్ కార్యదర్శి ధూపం వాసు మాట్లాడుతూ, దుబాయ్‌లో అల్లాను విమర్శిస్తే బహిరంగంగా ఉరితీస్తారని, జెరూసలేంలో ఏసుని దూషిస్తే చంపేస్తారని తెలిపారు. అటువంటిది లౌకిక రాజ్యంలో అందరూ సమానమే అయినప్పటికీ, హిందువుల మనోభావాలు దెబ్బతీసిన ద్రోహులను శిక్షించేలా చట్టాలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో పువ్వల శ్రీనివాసరావు, పి.వెంకటరావు, ఎన్నాబాబు పాల్గొన్నారు.

పనితీరు మారకపోతే చర్యలు



మాట్లాడుతున్న కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: సచివాలయ సిబ్బంది పనితీరు మారకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో వార్డు సచివాలయ అడ్మిన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. వార్డుల వారీగా పెండింగ్ పింఛన్లపై ఆరా తీశారు. ఇచ్చిన సమయానికి పెండింగ్‌లు పూర్తిచేయాలని చెప్పినా వినరా, అధికారుల మాట లెక్కచేయరా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయపాలన పాటించరు, యూనిఫాం ధరించరు ఇంత నిర్లక్ష్యంగా విధులు నిర్వహిస్తే ఎలా అని మండిపడ్డారు. ఇక నుంచి తీరుమార్చుకోకపోతే తీవ్రపరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ యూనిఫాం ధరించడంతోపాటు విధులకు సకాలంలో హాజరుకావాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు ఉన్నారు.

శాంతిభద్రతలపై అవగాహన కల్పించాలి

● సీఐ తిరుమలరావు



గ్రామ మహిళా పోలీసుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ తిరుమలరావు

రామభద్రపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో శాంతి,భద్రతల పరిరక్షణపై గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలని సీఐ తిరుమలరావు అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై సురేంద్రనాయుడుతో కలిసి గ్రామ సచివాలయాల మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాంతి,భద్రతల పరిరక్షణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు చేపడితే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. ప్రజలు అనధికార యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోకుండా అవగాహన కల్పించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేష్ కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కళాశాలలో ఇంటర్, డిగ్రీ తరగతులను షిఫ్ట్ విధానంలో నిర్వహిస్తుండడంతో విద్యార్థులకు పూర్తిస్థాయిలో తరగతులు జరగక వారు నష్టపోతున్నారన్నారు. అలాగే డిగ్రీ కళాశాలకు సొంతస్థలం కేటాయించి పక్కా భవనాలు నిర్మించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న భవనంలో మౌలిక సదుపాయాలు కూడా అంతంత మాత్రంగా ఉండడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో అధ్యాపకుల నియామకంతోపాటు ల్యాబ్‌లు నిర్వహణపై దృష్టిసారించాలని విన్నవించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామకృష్ణ, ఎస్.వెంకటేష్, నారాయణరావు, రాకేష్ తదితరులు ఉన్నారు.

35 శాతం సబ్సిడీపై రుణాలు

● డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ ఏపీడీ సావిత్రి

బొబ్బిలి రూరల్: అవసరమైన వారికి 35 శాతం సబ్సిడీపై పీఎంఈజీపీ రుణాలు అందిస్తున్నామని డీఆర్‌డీఏ ఏపీడీ కె.సావిత్రి తెలిపారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పొదుపు సంఘాల మహిళలకు రూ.15 లక్షల నుంచి 20 లక్షల రూపాయల వరకు రుణాలు ఇస్తామన్నారు. రుణాలతో టెంట్‌హౌస్‌లు, డీజె, ఫోటోగ్రఫీ వంటి వ్యాపారాలు చేసుకోవచ్చని చెప్పారు. ఇప్పటివరకు జిల్లాలో 370 యూనిట్ల ఏర్పాటుకు రుణాలు అందించామన్నారు. అలాగే పీఎంఎఫ్‌ఎంఈ ద్వారా ఫుడ్ ప్రాసెస్ యూనిట్లైన ఐస్‌క్రీమ్ పార్లర్లు, టీ హబ్‌లు, ఆయిల్ మిల్లింగ్, తదితర యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 180 వరకు యూనిట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. అలాగే స్వయం సహాయక సంఘాల ద్వారా పరిశ్రమల ఏర్పాటుకు రూ. కోటి నుంచి ఐదు కోట్ల రూపాయల వరకు రుణాలు మంజూరయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఆమె వెంట స్త్రీనిధి ఏజీఎం ఉమామహేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థుల సేవాభావం



భవిత కేంద్రం సిబ్బందికి నగదు అందజేస్తున్న విద్యార్థులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేట ఎంపీపీ పాఠశాల విద్యార్థులు తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని స్పీచ్ థెరపీ టేబుల్ కోసం తమవంతు సాయంగా రూ.3500లు బుధవారం అందించారు. గ్రీటింగ్ కార్డులు తయారు చేసి విక్రయించడం ద్వారా ఈ మొత్తాన్ని సేకరించినట్లు చెప్పారు. విద్యార్థుల సేవా భావాన్ని పాఠశాల ఉపాధ్యాయిని వడ్డి ఉషారాణి, డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీవీ వసంతకుమార్ తదితరులు అభినందించారు.

సంక్షిప్తంగా...

నూతన కార్యవర్గం

బొబ్బిలి: పట్టణానికి చెందిన వేణుగోపాల లైట్ మోటారు వర్కర్ల సంఘ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటరమణ,శివ.. ఉపాధ్యక్షుడిగా ఆనంద్, కోశాధికారిగా జయశంకర్, జాయింట్ సెక్రటరీగా లక్ష్మణరావు, జాయింట్ ట్రెజరర్‌గా సన్యాసిరావు, మరో ఐదుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు సంఘ సభ్యులు ప్రకటించారు.

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా శంకరరావు



పొట్నూరు శంకరరావు

బొబ్బిలి: సీఐటీయూ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న పొట్నూరు శంకరరావు రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. భీమవరంలో బుధవారం జరిగిన రాష్ట్ర మహాసభలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో శంకరరావును పలువురు అభినందించారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని

రేగిడి: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఆయా గ్రామంలో తప్పనిసరిగా ఉపాధిపనులు కల్పించాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. స్థానిక ఉపాధిహామీ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు మందగించాయని, ఈ సమయంలో వేతనదారులకు గతంలో గుర్తించిన విధంగా పనులు కల్పించాలని తెలిపారు. సమావేశంలో ఈసీ రామినాయుడు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

రాజాం: స్థానిక శాఖా గ్రంథాలయానికి రాజాం రచయితల వేదిక సభ్యులు కుదమ తిరుమలరావు నూతన సంవత్సరం సందర్భంగా 12 పుస్తకాలను బహూకరించారు. గ్రంథాలయ అధికారి సీహెచ్.వెంకటేష్‌కు బుధవారం వాటిని అందజేశారు. పాఠకులకు సాహితీ విలువలు పెంపొందించే పుస్తకాలు అందించడం ఆనందంగా ఉందని కుదమ అన్నారు. కార్యక్రమంలో కె.భాస్కరరావు, జి.భూషణరావు, వి.తవిటినాయుడు, కె.త్రినాథ, ఎస్.సంతోష్, కె.వెంకటేష్, కె.తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నైరెడ్‌లో స్వయం ఉపాధి శిక్షణ

రాజాం: నిరుద్యోగ యువతకు స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఉచిత స్వయం ఉపాధి శిక్షణను బుధవారం నుంచి ప్రారంభించినట్లు సంస్థ పీఓ నాగరాజు బుధవారం తెలిపారు. పురుషులకు రిఫ్రిజిరేటర్ అండ్ ఏసీ మెకానిక్‌లో 75 రోజుల పాటు వాల్టాస్ సహకారంతో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే మహిళలకు హోమ్ నర్సింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులని, శిక్షణ సమయంలో ఉచిత భోజనం, యూనిఫాం, వసతి సదుపాయాలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు 9866913371, 9491741129లను సంప్రదించాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ అక్కారావు

బాడంగి: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం తయారుచేసిన గణిత క్యాలెండర్‌ను ఎంపీడీఓ అక్కారావు బుధవారం ఆవిష్కరించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర గణిత ఫోరం అధ్యక్షుడు సిద్ధాంతం త్రినాథరావు, గణిత క్యాలెండర్ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మేటివ్ పరీక్షలు ప్రారంభం

బొబ్బిలి రూరల్: మండలంలోని అన్ని పాఠశాలల్లో సమ్మేటివ్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎంఆర్‌సీ కార్యాలయానికి చేరుకున్న ప్రశ్నపత్రాలను ఆయా పాఠశాలలకు పంపించామని, మొదటిరోజు పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు తెలిపారు.

ఉపాధి పనుల పరిశీలన

రాజాం సిటీ: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ బాసూరి శంకరరావు బుధవారం పరిశీలించారు. వేతనదారులంతా రెండు పూటలా పనులు చేయాలని, నిర్దేశించిన కొలతల మేరకు పనులు పూర్తి చేస్తే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఉండాలని, వేతనదారులకు ఎన్‌ఎంఎంఎస్ ద్వారా హాజరువేయాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు.

రూరల్ సీఐగా ఉపేంద్రరావు



సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఉపేంద్రరావు

రాజాం సిటీ: రాజాం రూరల్ సర్కిల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా హెచ్.ఉపేంద్రరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డి.నవీన్‌కుమార్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ పరిధిలోని మండలాల్లో నేరాల నియంత్రణతోపాటు శాంతిభద్రతల పరిరక్షణకు తన వంతు కృషిచేస్తానని అన్నారు.

6,7 తేదీలలో 'గడప గడపకు..'

మెంటాడ: మండలంలోని ఇప్పలవలస, చింతాడవలస గ్రామాల్లో ఈ నెల 6,7 తేదీలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ త్రివిక్రమ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో మంత్రి పీడిక రాజన్నదొర పాల్గొంటారని పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయండి

బొబ్బిలి: పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. శ్రీనివాసరావు సచివాలయ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ చాంబర్‌లో సచివాలయ ఇంజినీరింగ్ ఉద్యోగులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంట్రాక్టర్లు, అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలన్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి

పింఛన్ల పంపిణీ గ్రామాల్లో పండగ వాతావరణంలో కొనసాగుతోంది. పాత లబ్ధిదారులకు ఒకటో తేదీనే నగదు అందజేయగా.. కొత్తగా పింఛన్లు మంజూరైన వారికి వారోత్సవాల్లో భాగంగా ఇళ్ల వద్దకే వెళ్లి అందజేస్తున్నారు. పింఛన్ మొత్తాన్ని కూడా రూ.2500 నుంచి 2750 రూపాయలకు పెంచడంతో అవ్వా,తాత ముఖాల్లో చిరునవ్వు కనిపిస్తోంది.

– బొబ్బిలి/రాజాం నెట్‌వర్క్



రేగిడి: చిన్నశిర్లాంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు



రాజాం: మారేడుబాకలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు యాలాల వెంకటేష్



రామభద్రపురం: శ్రీరాంనగర్ కాలనీలో సచివాలయ కన్వనర్ కటికి శ్రీనివాసరావుతో కలిసి లబ్ధిదారుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ జానకి



వంగర: కొప్పరవలసలో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకుడు యలకల శ్రీనివాసరావు



తెర్లాం: తమ్మయ్యవలసలో దప్పు కళాకారులకు పెన్షన్‌లు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ, రంగప్పవలస సర్పంచ్‌లు



రాజాం: అమరాం గ్రామానికి చెందిన పోతల అప్పారావు విశాఖపట్నంలోని విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అక్కడకు వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్ గణేష్



బొబ్బిలి రూరల్: పెంటలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకుడు బొమ్మి అప్పలనాయుడు

వ్యాపారులు, కలాసీల మధ్య అంతరం

● ధరల పెంపుదలపై పట్టు వీడని ఇరువర్గాలు



కూలి రేట్ల విషయమై మాట్లాడుతున్న కిరాణా వర్తక సంఘం ప్రతినిధులు

బొబ్బిలి: పండగ సీజన్‌లో బొబ్బిలిలో చిక్కొచ్చి పడింది. కళకళలాడాల్సిన మార్కెట్ బోసిపోయే అవకాశం కనిపిస్తోంది. వ్యాపారులు, కలాసీల మధ్య కూలి రేట్ల విషయమై బుధవారం జరిగిన చర్చలు కూడా ఒక కొలిక్కి రాకపోవడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. ఈ నేపథ్యంలోనే కలాసీలు వ్యాపారుల కార్యకలాపాలను అడ్డుకోవడంతో వ్యాపారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో ఉన్న దాదాపు 175 దుకాణాల్లో పట్టణంలోని కలాసీలు పనులు చేస్తుంటారు. ఇందులో భాగంగానే ప్రతి రెండేళ్లకూ కూలిరేట్లు సవరిస్తుంటారు. వీరికి వివిధ సందర్భాల్లో కూలి రేట్లు పెంచుతున్నాయని వర్తకులు అంటుంటే.. ప్రతి రెండేళ్లకు తప్పనిసరిగా పెంచాల్సిందేనని కలాసీలు పట్టుబడుతున్నారు. అయితే కూలి రేట్లను సమీప పట్టణాలతో పోల్చి చూస్తే వంద శాతం కన్నా ఎక్కువగా ఉందని.. ఇప్పుడు మళ్లీ పెంచడం సామాన్య వ్యాపారులకు కష్టమని వర్తకుల సంఘ అధ్యక్షుడు కింతలి శ్రీనివాసరావు, కార్యవర్గ ప్రతినిధులు గ్రంధి ముత్యాలు, కోరాడ గణపతి, రామకృష్ణ, తదితరులు చెబుతున్నారు. సమస్యను చర్చల్లో పరిష్కరించుకోకుండా, దుకాణాల్లో వ్యాపార కార్యకలాపాలను అడ్డుకోవడం ఎంత వరకూ సబబని కిరాణా వర్తక సంఘ ప్రతినిధులు ప్రశ్నిస్తున్నారు.

డెంగీతో గురుకులం విద్యార్థిని మృతి

వంగర: మడ్డువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని మజ్జి రుతిక డెంగీతో బుధవారం మృతి చెందినట్లు ప్రిన్సిపాల్ పట్టా పద్మావతి తెలిపారు. విద్యార్థి అనారోగ్యానికి గురికావడంతో డిసెంబరు 5న తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామం వంగర మండలం శ్రీహరిపురానికి వెళ్లినట్లు చెప్పారు. జ్వరం అధికం కావడంతో రాజాంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంది. మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చెప్పారు.

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. మండలంలోని ఉంగరాడ, అప్పాపురం, మజ్జిరాముడుపేట, ఉంగరాడమెట్ట తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వస్తున్న చిన్నారులకు బుధవారం ఆరోగ్య పరీక్షలు చేశారు. చలితీవ్రత అధికంగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయించాలని చిన్నారుల తల్లిదండ్రులకు సూచించారు.

చిన్నారులకు వ్యాక్సినేషన్

వంగర: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోని చిన్నారులకు బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. 0–5 సంవత్సరాల వయసున్న చిన్నారులకు యూఐపీ ప్రోగ్రాంలో భాగంగా డీపీటీ, ఓపీవీ పెంటారోటా వ్యాక్సిన్లు వేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లూయిూ బ్రెయిలీ జయంతి



రామభద్రపురం: భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంఈఓ తిరుమల ప్రసాద్



రేగిడి: ర్యాలీ చేస్తున్న దివ్యంగ చిన్నారులు, భవిత కంద్రం సిబ్బంది

రామభద్రపురం: స్థానిక భవిత కేంద్రంలో ఎంఈఓ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో లూయిూ బ్రెయిలీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బ్రెయిలీ అంధులకు లిపి రూపొందించి ఎంతో మందికి జీవితాన్ని ప్రసాదించాడని ఎంఈఓ అన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఆర్పీలు బి.అచ్యుతరావు, సీహెచ్ రాజేశ్వరి, స్థానిక ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయురాలు ఎ. కళావతి పాల్గొన్నారు.

● తెర్లాం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ఐఈఆర్‌టీ సూర్యారావు ఆధ్వర్యంలో బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి అంధ విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెగ్యులర్ పాఠశాల హెచ్‌ఎం మేరీ గ్రేస్, స్పెషల్ ఉపాధ్యాయుడు సునీల్, ఫిజియో థెరపిస్టు యామిని, తదితరులు పాల్గొన్నారు.

● బాడంగి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బ్రెయిలీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం త్రినాథరావు మాట్లాడుతూ, నేడు ఎంతో మంది అంధులు ఉన్నత శిఖరాల్లో ఉన్నారంటే బ్రెయిలీ రూపొందించిన లిపే కారణమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, ఉపాధ్యాయులు సత్యనారాయణ, మోహనరావు, చిన్నారావు పాల్గొన్నారు.

● బొబ్బిలి రూరల్: అంధుల పాలిట దైవం లూయిస్ బ్రెయిలీ అని ఎంఈఓ సీహెచ్ లక్ష్మణరావు అన్నారు. బ్రెయిలీ జయంతి సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు శంకరరావు, అనిత, తదితరులు పాల్గొన్నారు.

● రేగిడి: పుట్టుకతో దివ్యాంగత్వం ఉందని చింతించకుండా, మనోధైర్యంతో ముందుకునడవాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు అన్నారు. లూయిస్ బ్రెయిలీడే సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ వలే పట్టుదలతో దివ్యాంగులు ఏదైనా సాధించేలా ఉండాలని సూచించారు. దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందన్నారు. అనంతరం పలువురు దివ్యాంగులకు బస్ పాస్‌లు అందజేశారు. ఐఈఆర్‌టీలు మహేశ్వరి, ఆర్.రాంబాబు, సీసీ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

● రాజాం సిటీ: అంధులపాలిట అక్షరప్రదాత లూయిస్ బ్రెయిలీ అని ఎంఈఓ పి.నాగయ్య అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో లూయిస్ బ్రెయిలీ జయంతి ఘనంగా నిర్వహించారు. మానవజాతిని ప్రభావితం చేసిన గొప్పవ్యక్తుల్లో బ్రెయిలీ ఒకరని ఎంఈఓ కొనియాడారు. ఈ సందర్భంగా రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు సమకూర్చిన నూతన వస్త్రాలను విద్యార్థులకు అందజేశారు.